

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 సెప్టెంబర్, 2022 సంచిక : 4

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. .......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం ........... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
శూద్ర బాలికే జగన్మాత .......... 4
ఆశకు అంతం లేదా .......... 7
సాయిభక్త దాసగణు .......... 12
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 15
శాశ్వత ధర్మగోప్త .......... 18
శ్రీ సాయి నిత్య పారాయణ .......... 21
మాతృసంస్థ కబుర్లు .......... 23
What is happiness .......... 27
ఒక పాఠం .......... 28
వృద్ధాశ్రమం .......... 30
భగవాన్ సేవలో నా జీవితము .......... 31
శ్రీ సాయిబాబా సూక్తులు .......... 32

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







## మా వాణి



ఈ దేవీ నవరాత్రులలో నాలో రగిలే ఆవేదన మీతో పంచుకుందామనీ, కాస్త గుండె బరువు తగ్గించుకొందామనీ ఈ వ్రాత.

అమ్మా, సర్వవిద్యామయీ శారదాంబా! మూలా నక్షత్రం రాగానే విద్యలన్నిటికీ మూలమైన తల్లివని నిన్ను అర్చిస్తున్నాం. కానీ, ఎక్కడమ్మా నీ ఉనికి? ఎంత అల్లాడినా నీ పొలకువ కానరాందే!

వేదవేదాంగాలూ నేర్చామని చెప్పకొంటూనే మాత్సర్యంతో కుళ్లు బుద్ధులతో కొట్టుకొంటున్న వేదపండితులలోనా? మహా పండితులమంటూనే భ్రష్ట సాహిత్యాన్ని సృష్టిస్తూ, మహాపురాణేతిహాసాలలోని కథలకూ్కడా వక్ర భాష్యాలు చెప్తున్న మాన్యులలోనా? ఏ ఇంగ్లీషు కథలనో, నవలలనో పట్టుకొని తమ భాషలలోకి అనువదించుకొని డబ్బు చేసుకుంటున్న నవలాకారులలోనా? ఉపాధ్యాయులం, అధ్యాపకులం అంటూ దౌర్భాగ్యపు భాషలు, చరిత్రలు బోధిస్తూ సత్యాన్వేషణ, మార్గదర్శకత్వాలే తెలియని పెద్దలలోనా? నోరు విప్పితే బూతులు, రెండర్థాల మాటలు తప్ప రానివారూ, పెద్దలను గురువులను కూడా మన్నించి మాట్లాడలేని వారూ, స్త్రీని మాతృస్వరూపంగా మన్నించి మాట్లాడటం మాట అటుంచి-కన్నతల్లితో కూడా సంస్కారయుతంగా మాట్లాడలేని వారూ అయిన విద్యార్థులలోనా? తమ బిడ్డలకు ధర్మం గురించీ, దేశం గురించీ, త్యాగం గురించీ చెప్పకుండా-పోటీ పడి ప్రక్కవాడిని నెట్టిపారేసి పరుగులు తీసి, పైపైకి-మళ్లీ మాట్లాడితే పరదేశాలకు ఎగిరిపొమ్మని చెప్పే తల్లిదండ్రులలోనా? సినిమాల బూతుపాటల్లోనా? టి.వి. యాంకర్ల ఒత్తులు రాని నత్తి మాటల్లోనా? ఎక్కడ తల్లీ నీ ఉనికి? మనిషి నాలుకే సరస్వతికి పీఠమనీ, దాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవా

లనీ, విద్య కంఠగతం కావాలనీ నేర్చుకున్న తరం వాళ్లం. కాగితం ముక్క కాలికి తగిలితే చటుక్కున వంగి కళ్ల కద్దుకున్న అలవాటు మాది. ఇప్పటి సరస్వతి ఏ రూపంలో ఎక్కడుందో కనపడక కొట్టుకొంటున్నాం తల్లీ!

ఇక నీ సంగతి ఆలోచిస్తే దిక్కుతోచటం లేదు జగదంబా, మహిషాసుర మర్దనీ! మూఢుడై, వరబలంతో, శరీరబలంతో జగమంతటినీ కల్లోలపరు స్తున్న మహిషాసురుని పీచమణచిన తల్లివి నీవు. ఆ ఉద్రిక్తతలో మహామహా పరమేశ్వరుని సైతం లెక్కచేయని శక్తిస్వరూపిణివి గదమ్మా! మరి, ఇప్పుడా శక్తి ఏమైపోయింది నీలో? ఆ ధర్మరక్షానిష్ఠ ఎటు పారిపోయింది నీలో? ఒక్క మహిషాసురుడిని చంపడానికే అంత క్రోధం ప్రదర్శించినదానివి- వేలాది, లక్షలాది మంది మహిషాసురులనెందుకు వదిలేస్తున్నావు?

అమ్మా, ఎక్కడ ఆ మహిషులంటావా? నీ చుట్టూరానే ఉన్నారు తల్లీ! దేశాన్ని రక్షిస్తామనీ, చల్లని పరిపాలన అందిస్తామనీ వాగ్దానాలూ, ప్రమాణాలూ చేసి మరీ గద్దెలెక్కి, ఆపైన దేశాన్నంతటినీ చుట్టుచుట్టి మ్రింగేద్దామని ప్రయత్నించే రాజకీయ నాయకులను మించిన మహిషాలెక్కడుంటాయి? దేశరక్షణ రహస్యాలను విదేశాలకు అమ్ముకొనే రాక్షసుల పేరు కూడా అదే గదా! మాటిమాటికీ అడిగినంత డబ్బు యివ్వలేదని కట్టుకున్న ఇల్లాళ్లను కాల్చి చంపే దున్నలకు, కోరిన ఆడది సరే అనలేదని యాసిడ్‌లు పోసి జీవితాలు బలి తీసుకునే దున్నపోతులకు లెక్కే లేదు. దేశాన్ని అల్లకల్లోలం చేసే ఉగ్రవాదులూ, దేశద్రోహులకు సరైన శిక్ష పడకుండా అడ్డుపడే శిఖండులూ-ఇదంతా మహిషాసుర సంతతే గదమ్మా! తాము దేశం మీదికి విసిరే పత్రికలూ, ముప్పావు వంతు నగ్నంగా ఉండే ఆడవాళ్లతో దరిద్రపు ప్రేమకథలతో, క్రూరదృశ్యాలతో తాము తీసే సినిమాలూ భవిష్యత్ తరం మీద ఎటువంటి దుష్టభావాన్ని చూపుతున్నాయో అన్న కనీసపు ఆలోచన కూడా లేని పబ్లిషర్లూ, ప్రొడ్యూసర్లూ-యింకా వారి తైనాతీలూ వీళ్లంతా దున్నపోతు రాక్షసులు కారా తల్లీ! ఏవో కొన్ని పేర్లే,





కొంతమంది గురించే అనుకొన్నాం గానీ-నేటి మహిషాసురుల సంఖ్య అనంతం. మరి వీరినెప్పుడు అంతం చేస్తావు తల్లీ!

అమ్మా, నవరూపాలలో విలసిల్లే దుర్గా, హైమావతీ, కౌమారీ, శారదా, రుద్రాణీ, జగద్ధాత్రీక్ష్మ కరుణ చిలికించు. ఒక్కసారి నీ కరవాలకాంతులు గగనతలమంతా వ్యాపించేలా విజృంభించు. నా యీ గడ్డను సర్వే సర్వత్రా, సర్వరీతులా పీల్చి పిప్పిచేస్తున్న ముష్కరుల గుండెలు ఝల్లుమనేలా నీ కరాళ దంష్ట్రాకాంతులు మెరిపించు. నలుచెరగులా విజ్ఞాన దీధితులు నిండేలాగా, ఈ భూమి నిష్కంటకమయ్యేలాగా, నిర్మాషిహమయ్యేలాగా చెలరేగి నీ లీలానటన చూపించు తల్లీ!

# శూద్రబాలికే జగన్మాత

**- మహనీయుల అడుగుజాడల్లో నుండి**

అవి విజయనగర చొక్కలింగ మహారాజు తిరుచిరాపల్లిని పాలిస్తున్న రోజులు.

ఒకనాడు ఆ మహారాజు తన కోట ఉపరితలంలో వెలసి ఉన్న వినాయ కుణ్ణి కొండ దిగువన వెలసిన జగదంబను సేవించి వస్తున్నారు. ఒక కొండరాయి మీద తాయుమాన స్వామి ధ్యాననిష్ఠులై కన్పించారు. ఆయన ముఖం నుండి ప్రసరించే దివ్యతేజస్సు పరిసరాలను ప్రకాశవంతం చేస్తోంది. వెంటనే మహారాజు పల్లకి దిగాడు. “ఆహా! ఈ రోజు స్వాముల దర్శనభాగ్యము కలిగింది. మంత్రీ ధ్యానం పూర్తి అయ్యేదాక వేచివుండి, ఆయన ఆశీస్సులు పొందుతాను” అన్నారు మహారాజు. కొంతసేపటికి స్వామి కళ్ళు తెరిచాడు. మహారాజు భక్తిప్రపత్తులతో స్వామికి నమస్కరించాడు. “శుభమస్తు, అభీష్ట సిద్ధిరస్తు” అని దీవించారు స్వామి.

వాతావరణం అతి శీతలంగా వుంది. బాగా చలిగాలి వీస్తోంది.

"ఇలాంటి ఎముకలు కొరికే చలిలో స్వామి కూర్చున్నారే, ఎంత కష్టపడుతున్నారో పాపం" అనుకున్నాడు రాజు. వెంటనే "మహామంత్రీ! తక్షణమే అతి విలువైన కాశ్మీరు శాలువాను తెప్పించండి! స్వామి వారికి దానిని నిండుగా కప్పిన తర్వాతే నేను ఇక్కడి నుండి కదులుతాను" అన్నాడు.

మహామంత్రి సేవకులను పంపి వెంటనే అపురూపమైన అందమైన శాలువాను తెప్పించి, "మహారాజా! ఈ కాశ్మీరు శాలువ అత్యంత విలువైనది" అని విన్నవించాడు. మహారాజు ఆ శాలువాను వినమ్రతతో స్వామి వద్దకు తీసుకెళ్ళాడు. "స్వామీ చలి ఎముకలను కొరికి వేస్తుంది. ఈ శాలువాను తమపై కప్పే మహాభాగ్యాన్ని ప్రసాదించ"మని ప్రార్థించారు. "మహారాజా! నీ ఇష్టప్రకారమే చెయ్యి" అన్నాడు స్వామి. తర్వాత మహారాజు సపరివారంగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

కొంతసేపయ్యాక, తాయుమానస్వామి మహారాజు తనకు ఇచ్చిన శాలువతో వెళుతుండగా దారిలో ఒక పేద బాలిక చలికి వణికిపోతూ కనిపించింది. ఆ బాలికను చూసి, స్వామి "బిడ్డా, ఇలా రావమ్మా!" అని పిలిచాడు. అక్కడున్న వారంతా, ఆ పిల్లను తాకవద్దని, శూద్రబాలికయని స్వామిని హెచ్చరించారు. అయినా లెక్కచేయక స్వామి ఆ బాలికను దగ్గరకు పిలిచి, మహారాజు తనకిచ్చిన శాలువాను ఆమెకు కప్పారు. తర్వాత నమస్కరిస్తూ వెళ్ళిరా తల్లీ!" అని ఆ బాలికతో పలికారు.

చారుల ద్వారా ఈ సంగతి మహారాజుకు తెలిసింది. మహారాజా! మీరు తాయుమాన స్వామికి సమర్పించిన శాలువను, ఆయన ఒక శూద్ర బాలికకు ఇచ్చేశారు. ఈ అవమానకరమైన సంఘటన రాజ్యంలో అల్లకల్లోలం లేవదీస్తోంది" అని విన్నవించారు చారులు. దీనితో మహారాజు అగ్రహోదగ్రుడైనాడు. "హా! ఎంత అవమానం! నేను భక్తిప్రపత్తులతో సమర్పించిన కానుకను స్వామివారు శూద్రబాలికకు ఇవ్వడమా? వెంటనే ఆయన్ను ఇక్కడకు రప్పించండి" అని ఆజ్ఞాపించాడు.





స్వామిని రాజసభకు తీసుకొని వచ్చారు.

మహారాజు స్వామితో "నన్ను అవమానపరిచేటట్లుగా తమరు ప్రవర్తించినందుకు కారణమేమిటో సెలవియ్యవలసింది" అని కోరారు. "నేను మిమ్మల్ని అవమానించానా?" అని ప్రశ్నించాడు స్వామి.

"నన్ను అవమానించినా, నేను మీకిచ్చిన కానుకను అవమానించినా రెండూ ఒక్కటే! నేను మీకు భక్తి ప్రపత్తులతో మర్యాద చేసింది తప్పా?" అని ప్రశ్నించాడు రాజు.

స్వామి విషయం గ్రహించి ఈ విధంగా తెలిపాడు :

"మహారాజా! నీకంటే నేను ఉన్నతుణ్ణనేగా నాకు శాలువాను సమర్పించి తృప్తిపడ్డావు? అలాగే నాకంటే ఉన్నతురాలైన ఆ బాలికకు ఆ శాలువానర్పించి నేనూ ఆత్మానందం పొందాను. ఇందులో అవమానానికి తావెక్కడ? భక్తాగ్రేసరుడవైన నీకీ విషయం స్ఫురించలేదా?" అని ప్రశ్నించాడు.

"స్వామీ మీరేమంటున్నారు ఈ శూద్ర బాలిక మీ కంటే ఉన్నతురాలా?" అన్నాడు మహారాజు.

"రాజా! భగవంతుడు సకల చరాచరాల్లోనూ విరాజిల్లుతున్నాడు. చలిలో వణికిపోతూన్న ఆ శూద్రబాలిక ఎవరనుకున్నారు? ఆమె నన్ను శోధించడానికి వచ్చిన సాక్షాత్తు జగన్మాత! సకల జీవరాసుల్లోనూ తానే విరాజిల్లుతున్నానని జగన్మాత ఆ బాలిక రూపంలో వచ్చి నాకు తెలిపింది. అందుకే నాకు ప్రియమైన ఆ శాలువాను ఆ జగన్మాతకు కానుకగా సమర్పించాను. నువ్వు ప్రీతితో నాకిచ్చిన ఆ కానుక జగన్మాతకు చేరినందుకు నువ్వు సంతోషించవా?" అని స్వామి ప్రశ్నించాడు.

దానితో రాజు జ్ఞానోదయమై, స్వామి పాదాలపై పడి మన్నించమని ప్రార్థించాడు.

# ఆశకు అంతం లేదా?

ఒక అభాగ్య బ్రాహ్మణుడు కడు పేదరికంతో బాధపడుతూ తమ గ్రామానికి వచ్చిన ఓ సాధుపుంగవుణ్ణి సందర్శించుకొని తన గోడును వెళ్లబోసుకున్నాడు. ఎన్నో మహిమలున్న ఆ స్వామీజీ ఆ దీనార్తుడి కష్టానికి కరిగిపోయి ఎలాగైనా సహాయం చేయాలనుకుంటాడు. కళ్ళు మూసుకొని తన దివ్యదృష్టితో ఆ రాజ్యంలోని ఓ అటవీప్రాంతంలో నాణాల రాశులున్నాయని తెలుసుకుంటాడు. వెంటనే ఆ పేద బ్రాహ్మణుడ్ని అక్కడకు వెళ్ళి, తనకు కావలసినంత సొమ్ము తెచ్చుకొని హాయిగా జీవించమని ఉపదేశించాడు. ఆ సాధువు మాట ప్రకారమే బ్రాహ్మణుడు ఆ చోటకు వెళ్ళి, తన కుటుంబానికి కావలసినన్ని నాణాలు తెచ్చుకొని తృప్తిగా జీవించసాగాడు.

ఈ విషయం బ్రాహ్మణుడి ఇంటిపక్క నున్న ఓ నూనె వ్యాపారికి తెలిసింది. శ్రీమంతుడే అయినప్పటికీ అతనికి దురాశ పుట్టుకొచ్చింది. నిరుపేదగా వేషం వేసుకొని, సాధువు వద్ద దీనంగా ధనం కోసం అర్థించాడు. సాధువుకు అతని దుర్బుద్ధి తెలిసినప్పటికీ, అతనికి గుణపాఠం నేర్పాలని వందల మైళ్ళ దూరంలో ఉన్న నాణాల నిధుల జాడ చెప్పాడు. ఒకానొక రోజు ఇంట్లో వాళ్ళకు కూడా చెప్పకుండా, నిధులున్న చోటికి ఆ వ్యాపారి వెళ్ళిపోయాడు. ఎంతో శ్రమకోర్చి అక్కడికి చేరుకొని, అక్కడ రాజముద్రికలున్న నాణాల రాశులను చూసి మంత్రముగ్ధుడయ్యాడు. వాటిని సంచుల్లో నింపుకొని, మూట కట్టుకోవడం మొదలుపెట్టాడు. ఎన్ని మూటలు కట్టుకున్నా ఆశ తీరడం లేదు. ఇలా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడచిపోయాయి. యుక్తవయస్సులో ఆ ప్రాంతంలో అడుగుపెట్టిన వ్యాపారి,





వృద్ధాప్యానికి చేరుకున్నాడు. చివరకు తన శక్తిని మించిన నాణాల బస్తాలను తీసుకొని గ్రామానికి వచ్చాడు. అప్పటికే అతని కొడుకులు, కూతుళ్ళు కన్నుమూశారు. మనుమలేమో ఈ లోభిని అసలు గుర్తే పట్టలేదు. రాజ్యాలు మారిపోయి దురదృష్టవశాత్తూ ఆ నాణాలు కూడా చెల్లుబాటు కాకుండా పోయాయి. ఈ మాత్రం దానికి ఇన్నేళ్ళు శ్రమించానా అనుకుంటూ, ఆ లోభి గుండె ఆగి చనిపోయాడు.

ఈ రోజుల్లో కూడా ఇలాంటివారు లెక్కకు మించి ఉన్నారు. ఆయువు తగ్గుతున్నా, ఆశ మాత్రం ఎనిమిది చేతుల అక్టోపస్‌లా అల్లుకుపోతోంది. ఇలాంటి ప్రమాదాన్ని ముందే ఊహించి, జగద్గురువులు శంకరాచార్యులు తన 'భజ గోవింద స్తోత్రం'లో ....

**దిన యామిన్యౌ సాయం ప్రాతః శిశిర వసన్తౌ పునరాయాతః।**

**కాలః క్రీడతి గచ్ఛాత్యాయుః తదపి న ముంచ త్యాశా వాయుః ...**

అన్నారు. పగలు, రాత్రి, ఉదయం, సాయంత్రం, శిశిరం, వసంతం వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాలం ఆడే ఆటలో ఆయువు తరిగిపోతూ ఉంటుంది. అయినా మానవుడు ఆశను మాత్రం వదిలిపెట్టడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక ప్రపంచంలో అంతం లేని ఆశలతో మనిషి పెడుతున్న పరుగులు విపరీత పరిణామాలకు దారితీస్తున్నాయి. ఓవైపు కాలం నిశ్శబ్దంగా తన ప్రతాపాన్ని చూపిస్తూ, పాఠాలు నేర్పుతున్నా మనకు కాదులే అన్నట్లు ప్రవర్తిస్తూ ఉన్నాం.

**పగటి వెంటే రాత్రి ... ప్రాభవం వెనకే పతనం! :** కోటి సూర్యప్రభలతో అరుణోదయమైనా, అది మాపటికి మౌనంగా అస్తమించాల్సిందే! వసంతం ఎన్ని పూలవానలు కురిపించి, మురిపించినా, శిశిరం రాగానే కొమ్మలు మోడువారాల్సిందే! మనుషులకైనా, మానులకైనా ఇదే కాలనియమం. మానవుడు

తప్ప, సృష్టిలోని అన్ని ప్రాణులూ ఈ శాశ్వత సత్యాన్ని మరచిపోకుండా, కాలానికి కైమోడ్చి మసలుకుంటున్నాయి. మనిషి మాత్రం, ఆ కాలభ్రమణానికి విరుద్ధంగా, తానొక చిరకాల జీవిననుకుంటూ వెఱ్ఱి ఆశలతో జీవిస్తున్నాడు. అందుకే శ్రీమద్భాగవతంలో భీష్మాచార్యులు ఇలా అంటారు:

**వాయువశంబులై ఎగసి వారిధరంబులు మింట కూడుచుం**
**బాయుచు నుండు కైవడి ప్రపంచము సర్వము కాలతంత్రమై**
**పాయుచు కూడుచుండు నొకభంగిచరింపదు కాలమన్నియుం**
**చేయుచు నుండు కాలము విచిత్రము దుస్తరమెట్టి వారికిన్ ...**

ఆకాశంలోని మేఘాలు గాలికి ఎగిరి పరస్పరం కలుసుకుంటూ విడిపోతూ ఉన్నట్లు, ఈ ప్రపంచంలోని ప్రాణికోటి సమస్తమూ కాలచక్రం వల్ల కూడుతూ, వీడుతూ ఉంటుంది. స్వేచ్ఛ అనేది లేదు. కాలమే అన్నిటికీ మూలం. కాలం చాలా విచిత్రమైంది. ఎంతటివారైనా ఈ కాలప్రవాహాన్ని దాటలేరని స్పష్టం చేస్తారు.

కానీ, మనం అవివేకంతో సమస్తాన్నీ మన ఆధీనంలోకి తెచ్చుకోవాలని వృథాగా ప్రయాసపడుతూ ఉంటాం. కాలం పెట్టే పరీక్షలో ఓడిపోతూ ఉంటాం. సమాజంలో కానీ, కుటుంబంలో కానీ నిరంతరం మనం నిమిత్తమాత్రుల్లా వ్యవహరిస్తూ ఉండాలి. జీవితప్రయాణంలో హఠాత్తుగా ఎదురొచ్చే ఏ మలుపునకైనా సిద్ధంగా ఉండాలి. కాలప్రవాహంలో ఏ పరిణామాన్నైనా హుందాగా స్వీకరించాలి. అది ప్రాభవం కావచ్చు; పతనం కావచ్చు. ఏదైనా మన ప్రారబ్ధం అనుకొని స్థైర్యంగా నిలబడాలి.

**ఆశతోనే అశాంతి :** ఈ రోజు మనలో అశాంతికి ప్రధాన కారణం-ఆశ. జీవితానికి సంబంధించి, మనం ఓ ఆశల పల్లకీని నిర్మించుకుంటాం. రంగురంగుల పూలతో అలంకరించుకుంటూ ఉంటాం. అలాగే పల్లకీ





సాగిపోవాలని కలలు కంటూ ఉంటాం. కానీ, చాలా సందర్భాల్లో ఆ కలలు నెరవేరనప్పుడు మనం అశాంతిపాలవుతాం. అందువల్ల శంకరాచార్యులు 'ఆశించేస్థాయి'లోనే మనస్సును అప్రమత్తంగా ఉంచమంటున్నారు. మన ఆయువెంత? దాంట్లో మనం అనుభవించేదెంత? అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. కళ్ళు చల్లగా ఉండాలంటే అద్దాలు కళ్ళకే పెట్టుకుంటాం; ప్రపంచాన్ని అంతా చల్లబరచలేం కదా! అలాగే లోకంలో కనిపించేవన్నీ అనుభవించాలన్న ఆశ కన్నా, వాటిని కోరుకునే మనస్సునే కట్టడి చేయాలన్న ఇంగితజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. అందుకే చాణుక్యుడు తన నీతి సూత్రాల్లో .....

**శాన్తి తుల్యం తపోనాస్తి న సంతోషాత్పరం సుఖమ్।**
**న తృష్ణాయాః పరో వ్యాధిర్నిచ ధర్మో దయాపరః॥**


అంటాడు. శాంతితో సమానమైన తపస్సు మరొకటి లేదనీ, సంతోషాన్ని మించిన శ్రేష్ఠమైన సుఖం మరొకటి ఉండదనీ, ఆశకు మించిన వ్యాధి మరొకటి లేదనీ, దయను మించిన ధర్మం లేదనీ వివరిస్తాడు. కానీ, ఈ రోజుల్లో చాలమందికి నిజంగా శాంతి, సంతోషం ఎక్కడ లభిస్తాయో తెలియదు. భగవాన్ శ్రీరామకృష్ణులు చెప్పినట్లు, వెలుగుతున్న లాంతరును మన చేతిలోనే పట్టుకొని, పక్కింట్లో నిప్ప కోసం అర్థించే అమాయకుల్లా మారిపోతున్నాం. చేతిలో దీపం ఉన్నా కూడా అవివేకి, ఆ స్పృహలేక చుట్ట కాల్చుకోవడానికి నిప్ప కోసం పక్క వారిపై ఆధారపడ్డాడు. మనం కూడా ఆనందం మన మనస్సుల్లో ఉంటే, దాని కోసం కార్లలో, బ్యాంకు ఖాతాల్లో, రాజభవనాల్లో, ఖరీదైన వస్త్రాల్లో వెతుక్కుంటున్నాం. అలాగని వాటిని వేటినీ సముపార్జించుకోవద్దన్నది ఆది గురువుల అభిప్రాయం కాదు. కానీ, అవి ఉంటేనే సంతోషంగా ఉంటామనుకోవడం అవివేకం.

**మాటు వేసిన మృత్యువు :** మనం మరచిపోయే మరో ముఖ్యమైన అంశం-మృత్యువు. అది రోజురోజుకూ మనకు దగ్గరవుతుందని గుర్తించం.

పోయినవాళ్లను చూసి పోతున్నవాళ్ళు ఏడ్చినట్లు, చనిపోయిన వారి ముందు నాలుగు కన్నీటి చుక్కలు కారుస్తాం. కానీ, మనం కూడా పోయే రోజు తప్పక వస్తుందనీ, ఆ లోపు మన కోసం మనమే బ్రతకడం కాకుండా, కొంతైనా ఇతరుల కోసం బ్రతుకుదామని ఆలోచించం. 'అందరూ వెళ్ళి పోతారు. నేను, నా పిల్లలు, నా మనుమళ్ళు, మనుమరాళ్ళు మాత్రమే శాశ్వతంగా ఉండి, ఈ ప్రపంచాన్ని అనుభవించేస్తాం' అన్నంత ధీమాతో మనలో చాలామంది స్వార్థపూరితులుగా జీవిస్తూ ఉంటారు. అందుకే ఓ మారు శ్రీరామచంద్రుడు విశ్వామిత్రుడితో "పిల్లి ఎలుకను ప్రియంగా చూస్తున్నట్లు ఒక పక్క మృత్యువు ప్రాణిని మింగివేయడానికి మహాభి లాషతో నిరంతరం చూస్తూ ఉంది. అయినా ఓ మహాశయా! ముసలి నర్తకి ఏ మాత్రం తనకు ఆనందం లేకపోయినా నృత్యం మానలేకపోయి నట్లు, ఈ 'ఆశ' అనేది పొందే తృప్తి ఏదీ లేకపోయినా, ఈ సంసారా రణ్యంలో తన చపల సంచలనం మాత్రం మానలేకపోతోంది. సంసారం లోని దోషాలన్నింటిలో ఇది అతి తుచ్ఛమైనది. ఇది ఉన్నంతవరకు మాకు మోహపూరితమైన పాట్లు తప్పవు" అంటాడు. ఆది శంకరులు చెప్పినా, శ్రీరామచంద్రుడు చెప్పినా ఒక్కటే - ఆశలపాశాన్ని ఎంత తుంచివేస్తే, మనిషికి అంత మనశ్శాంతి! గద్ద నోట్లో చేప ఉన్నంత కాలం కాకులు దాన్ని వెంబడిస్తూనే ఉంటాయి; చేపను జారవిడిచి కొమ్మపై కూర్చున్న మరుక్షణమే దానికి విశ్రాంతి; ప్రశాంతి! అలాగే మనిషికి ఆశలున్నంత కాలం ఈ అలుపెరుగని పరుగులూ తప్పవు; పడిపోవడాలూ తప్పవు. ఒక వయస్సు వరకు సంసారాన్ని ఓ చేతితో, భగవంతుడిని మరో చేతితో పట్టుకోవాలి; అయిన వారంతా ఓ స్థాయికి వచ్చాక, రెండు చేతులతో ఆ పరమాత్ముడి పాదాలనే పట్టుకోవాలి. అప్పుడే ప్రశాంతం ... పరమానందం!







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

ఇక, రాధాకృష్ణాబాయి విషయానికి వస్తే, ఆమె అసలు పేరు సుందరీ బాయి క్షీరసాగర్. ఆమె ఎప్పుడూ రాధాకృష్ణుల బొమ్మను చేతిలో పెట్టుకొని తిరగడం వలన అందరూ ఆమెను రాధాకృష్ణాబాయి అని పిలిచేవారు. చిన్న వయసులోనే అంటే, వివాహం జరిగిన మూడు రోజులలోనే భర్తను కోల్పోయి విధవరాలైంది. తీవ్ర విరాగినియై భగవత్ సేవలో కాలం గడుపుతూ శ్రీ నానాసాహెబ్ చందోర్కర్ ద్వారా బాబా గురించి తెలుసు కొని, ఆయనతో కలిసి బాబా దర్శనానికి వచ్చి, తన జీవన పర్యంతం షిరిడీలోనే గడిపింది. అనుక్షణం తాను బాబా సేవ కోసమై పరితపించి పోయేది. బాబా తమ భిక్ష నుండి పంపిన రొట్టెలను మాత్రమే తాను భుజించేది. బాబా సాక్షాత్తూ భగవంతుని అవతారం కనుక శాస్త్రవిధిని అనుసరించి భగవంతునికి జరిగే అన్ని ఉపచారాలు, సేవలు బాబాకు కూడా జరగాలనేది తన అభీష్టంగా ఉండేది. అందువలన తన అభీష్టంతో ఏకీభవించే అనుకూలురైన భక్తులను ఆమె చేరదీసి, వారి సహాయంతో ఒక్కొక్క వైభవాన్ని బాబా దర్బారులో ప్రవేశబెట్టేటట్లు చేసి, షిరిడీకి ఒక సంస్థాన్ రూపును తీసుకు వచ్చింది.

1910వ సంవత్సరానికి ముందు బాబా నివసించే మసీదులో మట్టి నేల మాత్రమే ఉండి, అది కూడా గతుకులు, గుంతల మయంగా ఉండేది. అసలు మసీదే చాలా శిథిలావస్థలో ఉండేది. బయటి ప్రాంగణం ఏ విధమైన పైకప్పు లేకుండా ఉండటంతో, వర్షం వస్తే మసీదు దుస్థితి చెప్పనలవి కాదు. మసీదు నేలంతా తడిసిపోయి, నేలలోని గుంతలలో వర్షపు నీరు నిలిచిపోయేది. అయినాసరే, బాబా అక్కడే నిద్రించేవారు.

అందువలన మసీదు నేలపై బండలు తాపడం చేసి, బయట సభా ప్రాంగణానికి రేకులతో పైకప్పు వేయడం రాధాకృష్ణాబాయి చొరవ, ప్రోద్బలం వలనే జరిగాయి.

షిరిడీ గ్రామంలో పిల్లలు చేసే మల విసర్జనతో, గ్రామస్తులు విసిరేసే చెత్తాచెదారంతో గ్రామంలోని దారులన్నీ అపరిశుభ్రంగా, దుర్గంధభరితంగా ఉండేవి. బాబా ఆ దారిలోనే నడుచుకుంటూ లెండీకి వెళ్ళి వచ్చేవారు. రాధాకృష్ణాఆయి స్వయంగా తన చేతులతోనే ఆ దుర్గంధాన్ని అంతా తొలగించి, కొందరు సహచర భక్తుల సహాయంతో బాబా లెండీకి బయలుదేరడానికి ముందు, ఆ దారులన్నీ ఊడ్చి, శుభ్రపరిచేది. అందువలన బాబాకు ఆ దారిలో నడిచేందుకు ఎటువంటి అసౌకర్యం కలగదని ఆమె భావన.

ప్రతిరోజు సాయంత్రం పూట బాబా మసీదుకు అనుకునియున్న దారిలో కొద్ది సమయం నడక సాగించేవారు. బాబా నడక సాగించే సమయంలో భక్తులు దారికి ఇరువైపులా నిల్చొని ఉండేవారు. ఆ సమయంలో బాబాకు ఆహ్లాదం కలగాలనే ఉద్దేశ్యంతో ఆ దారంతా ఆమె సుందరమైన, సువాసనా భరితమైన పూలతీగలతో లోగిళ్ళను ఏర్పాటు చేసింది. ఇలా చెప్పకుంటూ పోతే ఇంకెన్నో ... బాబాకు ఆరతులు ఇవ్వడం, విధిపూర్వకంగా పూజ చేయడం, నైవేద్యం సమర్పించడం, ఛత్రచామరలు, రాజదండాలు, వెండి పాత్రలు, అందమైన వేలాడే గాజుకుండీలు, గుర్రం, పల్లకీ, శ్రీరామనవమి వంటి ఉత్సవ సందర్భంలో బాబా చిత్రపటాన్ని షిరిడీ పురవీధులలో తిప్పడానికి ప్రత్యేకంగా ఏనుగు అంబారీ వంటి వాటిని ఏర్పాటు చేయడం, బాబా ఎప్పుడైనా అస్వస్థతకు లోనై భిక్షాన్నం ముట్టనప్పుడు కనీసం పాలైనా తాగుతారనే ఉద్దేశ్యంతో ఆవును పెంచడం, ఇలా ఎన్నో వైభవాలకు, సదుపాయాలకు చోటు కల్పించే ప్రక్రియను బాబా సేవగా భావిస్తూ, ఆ సేవలను అనుకూలురైన భక్తులకు పురమాయిస్తూ





తాను అనుక్షణం బాబా స్మరణలోనే గడిపేది.

బాబాను కేంద్రబిందువుగా చేసుకొని ఇన్ని వైభవాలు చోటు చేసుకుంటున్నా బాబా యొక్క ఆదర్శవంతమైన ఫకీరు జీవన విధానంలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. రాధాకృష్ణాఆయి ప్రవేశబెట్టిన వైభవాల పట్ల బాబా ఎంతో అలిప్తంగా ఉండేవారు. ఆయన ఎన్నడూ వీటి పట్ల ఆసక్తిని కనబర్చేవారు కారు. ఆయన ఎప్పుడూ పల్లకీలో కూర్చొనలేదు. అంతెందుకు, ఆయన ఎన్నడూ పాదరక్షలు వేసుకొనేవారు కారు. భక్తులు విధిపూర్వకంగా పూజ చేసుకొనేటప్పుడు, తమ ముచ్చటగా పాదరక్షలను తెచ్చి బాబా అనుమతితో-ఆయన కూర్చొని ఉన్నప్పడు-ఆయన పాదాలకు తొడిగో లేదా తాకించో చేసి, ఆ పాదరక్షలను తమ పూజలో పెట్టుకోవడానికై తీసుకెళ్ళేవారు. అటువంటి ఒక పాదరక్షల జతనే చావడి ఉత్సవ సమయంలో పల్లకీలో పెట్టి, పల్లకీని మోసేవారు. కానీ, బాబా మాత్రం భక్తులందరితో కలసి ఒట్టి కాళ్ళతో నడచి వచ్చేవారు. అసలు రాధాకృష్ణా ఆయినే ఇటువంటివి అన్నీ చేయవద్దని చాలాసార్లు తీవ్రంగా కోపించి మరీ-ఆమె ఎన్నడూ బాబా ముందుకు రాని కారణంగా-కబురు పంపించేవారు.

ఆ విషయాన్నే భక్తులు ఆమె వద్ద ప్రస్తావిస్తే, బాబా అలానే అంటారనీ, కానీ, అనుక్షణం మనల్ని కంటికిరెప్పలా కాపాడే ఆ దైవం బాగోగుల పట్ల మనం శ్రద్ధ వహించాలని, ఆయనను సౌకర్యవంతంగా ఉంచాలని, శాస్త్రోక్తంగా షోడశోపచారాలతో పూజించాలని, అలా చేయడం ఆయన పట్ల భక్తి కలిగియుండటంలో భాగమని చెపుతూ, తన వాక్చాతుర్యంతో వారిని సమాధానపరచి, తాను చెప్పినట్లు చేసేందుకు వారిని ఒప్పించేది. జరుగుతున్నదంతా బాబా కోసమేననే భావనతో భక్తులందరూ హృదయపూర్వకంగా ఆమె చెప్పిన సేవలలో లీనమయ్యేవారు.

**(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

(గత సంచిక తరువాయి)

జాన్‌కీ ఖతరా తాత్యాకా
దాన్ దీ అపనీ ఆయుకా ॥ 35
ఋణ బయజా కా చుకాదియా
తూనే సాయి కమాల్ కియా ॥ 36
పశు పక్షీ పర్ తేరీ లగన్
ప్యార్ మే తూ థా ఉన్‌కే మగన్ ॥ 37
సబ్ పర్ తేరీ రహం నజర్
లేతే సబ్‌కీ ఖుద్ కీ ఖబర్ ॥ 38
శరణ మే తేరే జో ఆయా
తూనే ఉస్కో అప్నాయా ॥ 39
దియే హైఁ తూనే గ్యార వచన్
భక్తోంకే ప్రతి లేకర్ ఆన్ ॥ 40
కణ కణ మే తు హై భగవాన్
తేరీ లీలా శక్తి మహాన్ ॥ 41
కైసే కరూఁ తేరే గుణగాన్
బుద్ధి హీన్ మై హూఁ నాదాన్ ॥ 42
దీన దయాళు తూ దాతా
హమ్ సబకాతూ హై త్రాతా ॥ 43
కృపా కరూ అబ్ సాయి మేరే
చరణో మే లేలో తేరే ॥ 44





సుబహ శామ్ సాయి కాధ్యాన్
సాయి లీలా కే గుణగాన్ ॥ 45
దృఢ భక్తి సే జో గాయేగా
పరమ పదకో వహ పాయేగా ॥ 46
హర్ దిన్ సుబహ ఔర్ శామ్ కో
గాయే సాయి బావనీ కో ॥ 47
సాయి దేగా ఉసకో సాథ్
లేకర్ అపనే హాథ్‌మే హాథ్ ॥ 48
అనుభవ తృప్తికే బోల్
శబ్ధ బడే హై యహ్ అన్‌మోల్ ॥ 49
యకీన్ జిసనే మానలియా
జీవన్ ఉసనే సఫల కియా ॥ 50
సాయి శక్తి విరాట స్వరూప్
మన మోహక్ సాయికా రూప్ 51
గౌర్ సే దేఖో తుమ్ భాయి
బోలో జయ సద్గురు సాయి ॥ 52

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జయ్**

**శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు**

**శుభం భవతు**

## దీనోంకా పాలన కరో

దీనోంకా పాలన కౌను కరే? సాయి రాం బినా దుఃఖ కౌన్ హరే
కౌన్ హై అపనా? సభీ పరాయే
బుఝో దియే కో కౌజలాయా?
భరీ హుయె గాగర్ సబ్ ఛులె
ఖాలీ గాగర్ కౌన్ భరే

జగ్ హై ఐసా గోరఖ ధందా
ఔర్ ఉలఝుతా జాతా బందా
కైస్జాఁ ఉ ద్వార తిహారే?
పగ్ పగ్ పర్ బైఠే పహారే

## గురు దత్త దిగంబర తవ శరణం

గురదత్త దిగంబర తవ శరణం
దాతా దత్త దిగంబర తవ శరణం ॥ గురు ॥
అత్రిసుత అనసూయ నందన
యోగిరాజ గురు తవ శరణం ॥ గురు ॥
శ్రీపాద శ్రీవల్లభ యతివర
నరసింహ సరస్వతి తవ శరణం
కార్యవీర్య భుక్తి ముక్తి ప్రద
పింగళ పూజిత తవ శరణం ॥ గురు ॥
గోరఖ గర్వ వినాశక దాతా
అవధూత నిరంజన తవ శరణం ॥ గురు ॥
హీన దీన తారక పూరుషోత్తమ
వాసుదేవ గురు తవ శరణం ॥ గురు ॥
ఏకనాథ జనార్ధన స్వామీ
అక్కలకోట గురు తవ శరణం ॥ గురు ॥
దాసోపంత్ యవన నృపతారక
సిద్ధ సరస్వతీ తవ శరణం ॥ గురు ॥
పూర్ణ పరాత్పర సగుణ గుణేశ్వర
నిరాకార గురు తవ శరణం ॥ గురు ॥
నీలకంఠ ఆలంబక నూరో
సాయినాథ గురు తవ శరణం ॥ గురు ॥
నారాయణ భైరవ మాణిక్ ప్రభు
రంగతార గురు తవ శరణం ॥ గురు ॥

**(సశేషం)**





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

### 8. త్వమేవ శరణం

వారం రోజులు గడిచినా ఆ పదహారు వేల ఒక వందమంది అబలల బంధువులలో దాదాపు ఒక నూరు మంది కన్నా ఎక్కువ మంది రాలేదు. వారిలో ఎక్కువమంది నరకుని రాక్షసత్వానికి గురై తమతమ గ్రామాలను విడిచి సుదూరరాజ్యాలకు వెళ్ళి తలదాచుకుంటున్నారు.

వాళ్ళందరికీ ఒకే ప్రశ్న!

పది, పదిహేనేండ్లు పరాయి రాక్షసుని చెరలో మ్రగ్గిన వీళ్ళను ఎలా భరించగలగడం! వారి గుణశీలాలను జనం శంకించడం సహజం కదా! త్రేతాయుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుడే సీతామహాదేవి శీలాన్ని ఎవడో సాధారణుడు శంకిస్తే, ఆమెను పరిత్యజించాడే! ఈ అబలలను, నిస్సహాయు రాండ్రను జనం మర్యాదగా చూస్తారా! మా కుటుంబాలు నలుగురిలో కలిసి బ్రతకడం సాధ్యమా!

'సత్యా! ఈ స్త్రీ జనాన్ని ఏమి చేద్దాం. వారి గతి ఏమిటి? ఆధారం ఏమిటి? లోకంలో స్త్రీ ఒంటరిగా బ్రతకగలదా?'

సత్యభామకు గడచిన ఆ కొద్దిరోజుల్లో మనసులో ఎన్ని సముద్రాల మథనాలు జరిగాయో! ఈ వారం రోజులు కృష్ణుడు తనను దాదాపు పలకరించలేదు. ఆ స్త్రీలను గురించి ఏమీ ప్రస్తావించలేదు. స్వామి అనుగ్రహించకపోతే వాళ్ల గతి ఏమవుతుంది? తనను, రుక్మిణీదేవిని మిగిలిన దేవేరులను ఆయన ఉద్ధరించిన త్రాతకదా! ఆ ప్రభువు అమృత చ్ఛాయలో ఎందరైనా బ్రతకవచ్చు. ఆయన పరమపురుషులు, జగదుద్ధర్త,

పతి-పరమేశ్వరుడు. ఆ పదహారు వేల మందికి ఆయనే తన ఏకాంత భక్తినిచ్చి, భరించాలి. సత్యభామ కృష్ణుని పాదాల వద్ద కూర్చున్నది.

'ప్రభూ! పరిష్కారమార్గం ఒకటే కన్పిస్తున్నది-నన్ను మన్నించి మీరు తలపెట్టిన మహాయజ్ఞంలో పాల్గొనే అవకాశం నాకు కూడా ఇవ్వండి'.

'నీవు నా వెంటనే ఉన్నావు కదా సత్యా!'

'మా నాయనగారు నాకు అపార సంపదనిచ్చారు. అదంతా మీదే. దానిని ఈ నారీమణులకు వసతులను, జీవనాధారాలను కల్పించడానికి వినియోగించండి'.

'అంటే నేను స్వయంగా భరించలేననే కదా!'

'ప్రభూ! హాస్యం కాదిది. నేను అహంకారంతో మిమ్మల్ని నా సంపదతో తూచి కొని, నా వారిని పూర్తిగా చేసుకోదలచి, మిమ్మల్ని తూచాను కదా! ఆనాడే నా సర్వసంపదను మీకు పణంగా ఒడ్డితిని కదా! అప్పటికీ మిమ్మల్ని తూచలేకపోయినాను. మా అక్కగారు రుక్మిణీదేవి చేతి ఒక తులసీదళం మిమ్మల్ని తూచ కలిగింది. ఇక మీకు మిగిలింది ఆ తులసీ పణంగా ఒడ్డిన ఆ సంపదా మీది!" అని క్షణం ఆగి స్వప్నంలో మాట్లాడుతూన్నట్లు 'వీళ్లం దరినీ ద్వారకకే తరలిద్దాం. ఒక్కచోట కాక, పైన దారుకావనంలో నాగ నాధుని సన్నిధి నుండి క్రింద సోమనాధ ధామం వరకు వారికి నివాసాలు కల్పింపచేద్దాం. ఆ పనికి నన్నే నియోగించండి. నేను పెద్దక్క రేవతి, రుక్మిణీ దేవిగారు, నా తోడికోడండ్లు వారి నివాస, సదుపాయాలను చూచు కుంటాం. అక్క శైబ్య ఉండనే ఉన్నది. మాతో అక్రూరులవారు, ఉద్ధవులు ఉంటారు. సమస్త లోకాలను భరించగల నా వాసుదేవ ప్రభువుకు, వీరిని స్వీకరించి ముక్తిమార్గాన్ని చూపడం కష్టమా ప్రభూ! గోప గోపీజనం మీ సేవలో లీనం కాలేదా? వారికి మీరే నాథులు. మీ సంస్మరణమే శ్వాసలుగా మీ ఏకాంతభక్తితో వారు తరిస్తారు. మీరే వారిని ఉద్ధరించి, విముక్తలను చేసారు. మీరు వారిని కలిస్తే పరిత్యక్తులుగా కాకుండా మీ ఆశ్రితురాండ్రుగా శీలవంతులుగా జీవించగలుగుతారు' సత్యభామ కనులు వర్షించాయి.





మాటలో, గొంతులో వణుకు ధ్వనించింది.

కృష్ణుడు సత్యభామను అంకాన చేర్చుకున్నాడు. 'సత్యా! నీది ఎంత గొప్ప హృదయం! అలాగే కానీ! కాని వీరిని క్రమంగా ముందు ప్రభాసకు పంపే ఏర్పాట్లు చేయాలి. రేపు ఆలోచిద్దాం. తర్వాత విషయం ద్వారకలో పెద్దలందరినీ విచారించి, తుదినిర్ణయం తీసుకుందాం'.

నరకుడు అపహరించిన అదితి కుండలాలను, వరుణచ్ఛత్రాన్ని, మంత్రి పరివార సమేతంగా భగదత్తుడే వెళ్ళి కుండలాలను మహాసాధ్వి అదితికి, వరుణచ్ఛత్రాన్ని త్రివిష్ణవ ప్రభువుకు సమర్పించి, పరిహారరూపంగా అమూల్యములైన కానుకలను సమర్పించి వచ్చారు.

సత్యభామ నిర్ణయానికి అక్రూర, ఉద్ధవ, సాత్యకులే కాక, ఆప్తులందరూ అమితంగా ఆనందించారు. భగదత్తుడు వారిని సగౌరవంగా, సన్మాన పూర్వకంగా దళాలు దళాలుగా పంపడానికి బండ్లను ఏర్పాటు చేయిం చాడు. ఆ దళాల వెంట మణిమానుడు నాగ సైనికులతో, గరుడయోధు లతో వైనతేయుడు, తమ వెంట వచ్చిన మిగతా యాదవవీరులు తమ తమ బలగాలతో బయలుదేరుతారు. చిత్రవాహనుడు, త్రివిష్టపాధిపతి తమ సేనాధిపతులను బలగంతో పంపడానికి అంగీకరించాడు. ఒక్కొక్క దళంలో అయిదు వందల బండ్లు, రెండు వేల మంది జనం మహా సముద్ర తరంగాలుగా సాగిన ప్రయాణమది.

ఏకాదశి నాడు భగదత్తుడు ఆ పదహారు వేల ఒక వంద మందికి నూతన వస్త్రాలను, ముక్తావళులను కానుకగా సమర్పించి, తన తండ్రి చేసిన దుర్మార్గానికి క్షమాపణలు కోరుకున్నాడు. భూదేవి తన కొడుకు ప్రవర్తనను మొదటి నుండీ గర్హిస్తూ వచ్చిన ఉత్తమురాలే. ఆ స్త్రీలందరినీ ఆశీర్వదించి 'భూభార వహనదక్షుడు ఆ కేశవుడు-మీరు ఆయన నీడలో ఆయనే భర్తగా, ధర్తగా, ఏకాంతసేవలో తరించండి' అని దీవించింది.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

ఆ.వె. రాధ చేతివంట రమ్యమౌ శొంఠుండ
భీష్మ కీర్తనలకు పీరులెగుర
పల్లకీలవేడ్క పరమ వైభవమాయె
మతములన్ని యొక్క మతము సాయి. 11

తే.గీ. కనుల బడినంత గులాము కస్సుమనియె
కంభము పెకళించుచు, తాత్య కండువాకు
మంట రగిలించె సాయీశు మండిపడుచు
సాయి కోపగించుట యన్న సమ్మతి యగు. 12

కం. జరిగెను జీర్ణోద్ధరణము
భరియించగ భారమంత తాత్యయు మాధవ్
పరగెను శుభ్రత రాధయు
మరి వెలిగె ద్వారకమయి మహిమన సాయిన్. 13

ఆ.వె. జంట ఉత్సవములు జములుగా రూపొందె
నాటినుండి వరుస నేటి వరకు
పొరపొచ్చములను పోద్రోలి యందరు
శిరిడి సాయి చలువ-చెందు చుండె. 14





## 13. ధునిలోన తనచేయి దూర్చె సాయి

తే.గీ. ధౌతి, ఖండాది యోగ సాధనలు జేయు
నిరతము సమాధి నందుండు నిష్ఠ గలిగి
ఆచరించెడు పద్ధతి హైందవమ్ము
కృతికి యవనుడా యనదోచు ఋషియె సాయి. 1

తే.గీ. చెవులు కుట్టించు కొనియెను చిన్న నాడె
అగ్ని హోత్రము వెలిగించు, అర్ఘ్యమిచ్చు,
శంఖనాదము, హోమము శంకయేల
సాయి హిందువనగ లేదు సందియంబు. 2

ఆ.వె. అహపు మదము విడచి యిహపు సుఖము వీడి
యింద్రియముల కట్టి యీశు వేడ
సిద్ధపురుషుడగుదు వద్వైత మహిమన
బ్రహ్మ భావమొంది బరగె సాయి. 3

తే.గీ. సచ్చిదానంద రూపుడు సాయిబాబ
శిరిడి నందున నెలవున్న శివుడె తాను
సంతు, సన్యాస ముఖ్యులు, సాధు జనులు
ఆశ్రయించుచు నుండిరి యద్వితీయు. 4

కం. నిరతము, 'అల్లా మాలికు'
మరువక, నామపు జపమును మనమున జేయున్
గఱపును వేదాంతంబుల
నరమరకలు లేక దీర్చు యార్తుల బాధల్. 5

**(సశేషం)**

# మాతృసంస్థ కబుర్లు

ఆగస్టు 5వ తేదీ శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం మన ఆచారం. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తాం.

సాయిధామం ఆశ్రమంలో వరలక్ష్మీ దేవి పూజా కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ముందురోజు రాత్రే అమ్మవారి రూపాన్ని సిద్ధం చేసుకొని, తెల్లవారుజామననే సాయినాథుల వారికి కాకడ హారతి, అభిషేకం, ప్రత్యేక పూజా అనంతరం శ్రీ వరలక్ష్మీ దేవి పీఠాన్ని ఏర్పాటు చేసి వన్నెవన్నెల పుష్పాలతో అలంకరించారు. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీవారి ఆధ్వర్యంలో 40 మంది ముత్తైదువలతో పూజా కార్యక్రమం జరిగింది. ప్రతి మంత్రానికి అర్థాన్ని వివరిస్తూ స్వామీజీ భక్తులందరినీ భక్తి పారవశ్యంలో ముంచివేసారు. తల్లి గొప్పదనాన్ని వివరించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులంతా అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించి తరలివెళ్ళారు.

ఆగస్టు 4వ తేదీ నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ మరియు శ్రీనివాస్ నగర్ కాలనీలోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి మరియు శ్రీ షిరిడీ సాయిబాబా వారి 14వ వార్షికోత్సవ సందర్భంగా మరియు శివలింగ, సుబ్రహ్మణ్య స్వామి, కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సాయిధామం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారి కరకమలములచే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామీజీ ప్రసంగిస్తూ ప్రతి వ్యక్తి తమ జీవితాలలో ఆధ్యాత్మికతను అలవరచుకోవాలనీ, అదే ముక్తికి మార్గమని వివరించారు. ఈ లౌకిక సుఖాలన్నీ వ్యర్థమైనవని పరమాత్మ ఒక్కరే శాశ్వతమైన వారనీ





భక్తులంతా హిందూత్వాన్ని, సంప్రదాయాలను మరువరాదని ముందు తరాలకు అందించాలనీ సెలవిచ్చారు. దైవకార్యాలు చేస్తేనే విజయాలు సిద్ధిస్తాయి. మానవజన్మని సద్వినియోగం చేసుకోవాలని బోధించారు.

**శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం-సత్తెనపల్లి శాఖ**

ఆగస్టు 14, 15 తేదీలలో శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో ఆనంద సాయి ప్రభు మందిర అష్టమ వార్షికోత్సవ కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగినవి.

13వ తేదీ నాటికి కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయినవి. సాయిధామం సేవాశ్రమం నుండి పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు, ఆశ్రమ పిల్లలు, ఆశ్రమ కార్యకర్త శ్రీమతి ధనలక్ష్మిగారు, తెనాలి నుండి ట్రస్టు సభ్యులు శ్రీ గోపీకృష్ణ, సాయిమాధురి దంపతులు వచ్చారు. 14వ తేదీ ఉదయం గం.5.15 ని.లకు ఆనంద సాయి ప్రభు వారికి కాకడ హారతి ఇచ్చారు. అనంతరం అభిషేకం, అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమాలు జరిగినవి. గం.9.00లకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి కరకమలములతో ధ్వజారోహణ జరిగినది. అనంతరం గం.10.00లకు సాయిచాలీసా పారాయణ జరిగినది.

సాయంత్రం గం.5.00ల నుండి ఆనంద సాయి ప్రభు వారి ఉత్సవ మూర్తి ఊరేగింపు జరిగినది. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు ఊరేగింపు వాహనానికి, బాబా వారికి హారతిచ్చి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీమతి శ్రీలక్ష్మిప్రేమ్‌కుమార్ బాబా వారికి వారు పోసి నమస్కారం చేశారు. అనంతరం బాబా వారు ఊరేగింపుగా పురవీధులలో భక్తుల దర్శనార్థం తరలివెళ్ళారు. భక్తులు ప్రతి వీధిలో బాబా వారికి వారు పోసి హారతులు, కానుకలు సమర్పించారు.

ఆగస్టు 15వ తేదీ ఉదయం గం.5.15ని.లకు ఆనంద సాయి ప్రభు వారి కాకడ హారతి ఇచ్చాము. అనంతరం ఉదయం గం.6.30లకు ఆనంద

సాయి ప్రభు వారికి సహస్ర ఘటాభిషేకం వైభవోపేతంగా జరిగినది. మంగళ వాయిద్యాలతో భక్తులు తమ ఇండ్ల నుండి కలశాలతో శుద్ధ జలమును, తులసీ దళాలతో తీసుకొని వచ్చి బాబా వారికి అభిషేకం చేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా కలశాలతో తరలివచ్చిన భక్తులు వారి ముందు సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు, వారి ముందు పూర్ణ కలశంతో ఆశ్రమ నిర్వాహకులు, పూజారి గారు ముందు నడవగా అందరూ ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేసి ఆనందసాయి మందిరంలోకి అడుగుపెట్టారు. ముందుగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు పంచామృతాలతో ఆనంద సాయి ప్రభు వారికి అభిషేకం చేసారు. అనంతరం భక్తులు భక్తి పారవశ్యంతో సహస్ర కలశాలతో కన్నుల పండువగా అభిషేకం చేశారు. అభిషేకానంతరం బాబా వారికి నూతన వస్త్రధారణ, కిరీటధారణ జరిగి, పూలమాలాలం కృతులై దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పూజారి గారు బాబా వారికి అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమం జరిపించారు. వరుణ దేవుడు చిరుజల్లులతో బాబా వారిని అభిషేకిస్తూనే ఉన్నారు. కార్యక్రమానికి వర్షం ఆటంకం కలిగిస్తుందేమో అన్న సందేహం పటాపంచలు చేస్తూ బాబావారు తమ దివ్యశక్తితో ఎటువంటి ఆటంకం కలుగకుండా చేయడం, ప్రతి సంవత్సరం ఇది పరిపాటి అయినది. ఉదయం గం.10.30లకు వచ్చిన భక్తులు లక్ష పుష్పార్చన కార్యక్రమానికి తెచ్చిన వివిధ వర్ణశోభిత పుష్పాలను అలంకరించిన పళ్ళాలతో మందిరం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి పూజా కార్యక్రమానికి సిద్ధంగా ఉంచారు. అనంతరం శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చనకు కూర్చున్న భక్తుల చేత శాస్త్రోక్తంగా సహస్ర నామాలతో లక్ష పుష్పార్చన చేయించారు. ఆశ్రమ





నిర్వాహకులు పూజారిగారు పుష్పాలను దోసిళ్ళతో బాబా వారిని అభిషేకిస్తుండగా బాబా వారి మీద జాలువారుతున్న రంగురంగుల పూలు- ఆ దృశ్యం చూసిన భక్తులందరూ ఆనందాతిశయాలతో సాయినాథునికి జై అని ముక్తకంఠంతో పలికారు. లక్ష పుష్పార్చన కార్యక్రమ అనంతరం ఆనంద సాయి ప్రభు వారి అష్టమ వార్షికోత్సవ సందర్భంగా అన్నదాన కార్యక్రమం జరిగినది. సుమారుగా 2000 మందికి పైగా భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని బాబా వారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శ్రీ కోదండ రామ సాయి సన్నిధానంలో కూడా జాతీయ జెండాను శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారిచే ఆవిష్కరించబడింది. వచ్చిన భక్తులందరూ జాతీయ జెండాకు సెల్యూట్ చేసి తమ దేశభక్తిని చాటుకున్నారు.

కార్యక్రమ ఆద్యంతం ఎటువంటి ఆటంకం కలుగకుండా చేసిన సాయి నాథులకు, పరమపూజ్య గురుదేవులకు, మాతాజీ గారికి మా హృదయ పూర్వక నమస్సుమాంజలి. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహక రించిన భక్తులకు, విరాళాలు ధన రూపేణ, వస్తు రూపేణ అందించిన వారికి, సహకరించిన ఆశ్రమ పిల్లలకు, ముందుగా వచ్చి కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించి, దిగ్విజయంగా నడిపించిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేస్తూ అందరికీ సాయినాథుని దివ్యఆశీస్సులు కలగాలని శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు తరపున మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

ఆగస్టు 19వ తేదీ శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆశ్రమంలో ఉన్నటువంటి శ్రీకృష్ణ ప్రతిమకు అభిషేక, అష్టోత్తర శతనామావళి పూజలు చేసాము.

సాయంత్రం గం.4.00ల నుండి వచ్చిన పిల్లలందరిచేత ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేసాము. పిల్లలందరూ ఆనందోత్సాహాలతో వర్షంలోనే ఉట్టి కొట్టారు. విజేతలకు బహుమతి ప్రదానం చేసాము. ప్రసాద వితరణతో కార్యక్రమం దిగ్విజయంగా ముగిసినది.

# WHAT IS HAPPINESS

*- P.P. Bhagawan Ramana Maharshi "Who am I?"*

Happiness is very nature of the self; happiness and the self are not different. There is no happiness in any object of the world. We imagine through our ignorance that we derive happiness from objects. When the mind goes out, it experiences misery. In truth, when its desires are fulfilled, it returns to its own place and enjoys the happiness that is the self. Similarly, in the states of sleep, smadhi and fainting and when the objects desired is obtained or the object disliked is removed, the mind becomes inward-turned and enjoys pure self-happiness. Thus the mind moves without rest, alternately going out of the self and returning to it. Under the tree the shade is pleasant, out in the open the heat is scorching. A person who has been going about in the sun feels cool when he reaches the shade. Some one who keeps on going from the shade into the sun and then back in to the shade is a fool. A wise man stays permanently in the shade. Similarly, the mind of the one who knows the truth does not leave Brahman, the mind of the ignorant, on the contrary, revolves to Brahman to experience happiness. In fact, what is called the world is only thought. When the world disappears, i.e. when is no thought,





the mind experiences happiness and when the world appears, it goes through misery.

**What is the wisdom-insight (jnana-dristi)?**

Remaining quiet is what is called wisdom - insight. To remain quiet is the resolve the mind in the self. Telepathy, knowing past, present and future happenings and clairvoyance do not constitute wisdom or insight.

**What is the relation between desirelessness and wisdom?**

Desirelessness is wisdom. The two are not different they are the same. Desirelessness is refraining from turning the mind towards any object. Wisdom means the appearance than the self is detachment or disirelessness; not leaving the self is wisdom.

# ఒక పాఠం

*- పూజ్యశ్రీ హెడ్గేవార్ జీవితం నుండి*

స్వయం సేవకులు ఎలా ఉండాలో చెప్పడమే కాదు. ఎలా ఉండకూడదో కూడా డాక్టర్‌జీ చెప్పిన సందర్భాలున్నాయి. నాగపూర్‌లోని ఒక శాఖలో స్వయం సేవకులు తమలో తాము కొట్లాడుకొన్నారు. స్వయం సేవకులలో పరస్పరం ప్రేమ అనురాగాలు వర్ధిల్లాలి. అది పోయి కొట్లాడుకుంటే చాలా బాధపడవలసిన విషయమే. ఒకరోజు డాక్టర్‌జీ ఆ శాఖకు వెళ్లారు. శాఖలో ఉన్న స్వయంసేవకులందరినీ ఒకచోట చేర్చి పరస్పరం సేవాభావాన్ని పెంపొందించుకోవడమే సంఘకార్యానికి ఆధారం అంటూ ఎంతో భావయుక్తంగా చెప్పారు. సోదర స్వయం సేవకులపై చేయి చేసుకున్న వారు శిక్ష అనుభవించాల్సిందే అన్నారు. ఆ కొట్టినవారు కొద్ది

రోజులు శాఖకు రావడానికి వీల్లేదన్నారు. అయితే వాళ్లు డాక్టర్‌జీని ఇంటి వద్ద కలుసుకోవచ్చని ఒక సౌలభ్యం కూడా కలుగజేశారు. కానీ, శాఖకు రావద్దనడం కంటే స్వయం సేవకునికి పెద్ద శిక్ష ఏముంటుంది? శిక్ష విధించబడిన స్వయం సేవకుల కళ్ల వెంట నీరు కారుతున్నాయి. అయినా డాక్టర్‌జీ హృదయం చలించలేదు. లేకుంటే క్రమశిక్షణ పాటించడం కష్టం. మరుపురాని సంఘటన అది.

మిగతా సంస్థలలో అలాటి శిక్ష విధిస్తే-మళ్లీ ఆ సంస్థ ముఖం చూడకుండా పోతారు. ఇక్కడేమో శాఖ నుంచి వెలివేయబడిన వ్యక్తులకు దుఃఖం కట్టలు తెంచుకొని వచ్చింది. అందుచేత శిక్షాకాలం ముగిసి మళ్లీ శాఖకు వచ్చిన రోజున వారి ముఖాలు వికసించాయి. వారిలో ఒకరు తర్వాత చాలా పెద్ద బాధ్యత - అంటే ప్రాంత ప్రచారక్ బాధ్యత నిర్వహించారు కూడా. నాగపూర్‌లో అలాంటి సంఘటన మళ్లీ జరగలేదు. డాక్టర్‌జీ కూడా మళ్లీ ఆ సంగతి ప్రస్తావించలేదు. అయితే పరోక్షంగా ఆ సంఘటన గుర్తుకు తెస్తూ ఒకసారి తమ ప్రసంగంలో ఇలా అన్నారు- "మిత్రుని మీద ప్రేమ ముఖ్యమా, సంఘంపైన ప్రేమ ముఖ్యమా అన్న ప్రశ్న ఉదయించినపుడు దానికి సమాధానం ఒక్కటే - సంఘం ముఖ్యం. మిత్రప్రేమ, కుటుంబ కార్యం ఆ తర్వాతనే. సంఘ కార్యం మినహా వ్యక్తిగత సుఖదుఃఖాలు ఏవైనప్పటికీ సంఘం కోసం వీటిని సంతోషంగా ప్రక్కకు పెట్టాల్సిందే. సంఘంలో నీదైన ఒక వర్గాన్ని తయారుచేసుకోవద్దు. సంఘం యావత్తు నీదే. సంఘం కోసమే జీవిద్దాం. సంఘం కోసమే మరణిద్దాం- అన్న సంకల్పం మనస్సులో ఉంచుకొని వ్యవహరించాలి.

(పైన డాక్టర్‌జీ అన్న మాటలు ప్రతి సేవా సంస్థకూ, అందులోని ప్రతి కార్యకర్తకూ కూడా నిత్య సంస్మరణీయాలు కావాలి.)





# వృద్ధాశ్రమం

సాయిధామం ఆశ్రమంలో **"సంధ్య"** పేరిట ఒక అరక్షిత (దిక్కు లేని వారి) వృద్ధాశ్రమం నడుస్తున్నది. సంతతి లేక, ఏ ఆధారము లేని వృద్ధ స్త్రీ, పురుషులకు (నారాయణి, నారాయణ) ఇక్కడ అవకాశం ఉన్నది. వీరికి భోజనం, వైద్యం, వస్త్రం అన్నీ ఆశ్రమమే ఉచితంగా సమకూరుస్తుంది. ఇలాంటి అవసరం ఉన్న వృద్ధులు దిగువ ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

1. వయస్సు 55-70 సం.ల మధ్య ఉండాలి.
2. ఆశ్రమ విధానాలకు వీరు కట్టుబడి ఉండాలి. (దైవచింతన, కలిసి మెలసి ఉండటం వంటివి)
3. వారి పనులు వారు చేసుకోగలిగే స్థితిలో ఉండాలి.
4. సిగరెట్టు, గుట్కా, త్రాగుడు వంటి అలవాట్లు ఉండకూడదు.
5. ఆరోగ్యం బాగున్నంత వరకు సత్సంగాలలో పాల్గొంటూ ఉండాలి.
6. వారిని చేర్చేవారు స్వయంగా వచ్చి సంప్రదించి చేర్చి, అప్లికేషన్ ఫారం మీద సంతకం చేయాలి.

ప్రస్తుతం 10 మందికి స్త్రీల విభాగంలోనూ, 10 మంది పురుషుల విభాగం లోనూ ఖాళీలు ఉన్నాయి. సాయిభక్తులు ఈ అవకాశం ఉన్న వృద్ధులకు సహకరించి చిరునామా వివరించగలరు.

**- సాయిధామం**

**ఫోన్స్ : 9440413455, 9848133565**

(ఆశ్రమం కీసరకు 6 కి.మీ. దూరంగా వుంది. హైదరాబాద్‌కు 33 కి.మీ, ఇ.సి.ఐ.యల్. చౌరస్తాకు 18 కి.మీ దూరంలో ఉంది. సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర గల బస్టాప్ నుంచి ఇ.సి.ఐ.యల్. చౌరస్తా నుంచి వచ్చే బస్సులు ఇటు వస్తాయి. బస్టాపు పేరు సాయిధామం. తుర్కపల్లి, హాజీపూర్, చీకటిమామిడి, ఉద్ధమర్రి, లక్ష్మాపూర్ వగైరా బస్సులు)

# భగవాన్ సేవలో నా జీవితము

- పులిచెర్ల ఆదినారాయణగారి రచన నుండి

**ప్రశ్న : ఆత్మను తెలుసుకోవాలనే తీవ్రమైన కోరిక ఉండవలసిందేనా? సాధన పురోభివృద్ధికి ఆ కోరిక అవసరమా? లేక ఆ కోరికను కూడా వదలి అంకిత భావముతో ఉండటం ఉచితమంటారా?**

**జవాబు :** ఒకమారు నారద మహర్షి వైకుంఠానికి వెడుతూ తపస్సు చేసే ఇద్దరు సాధువులను కలిశారు. వారు ఆయనను ఎక్కడకు పోతున్నదీ అడిగారు. "వైకుంఠానికి పోతున్నాను" అన్నారు నారద మహర్షి. "దయచేసి మా తపస్సు ఎంతవరకు సఫలీకృతమయిందో ఎప్పుడు మోక్షము ప్రాప్తిస్తుందో విష్ణుమూర్తి నడిగి తెలుసుకొని రండి" అని వారు వేడుకొన్నారు. నారద మహర్షి వైకుంఠానికి వెళ్లి సమాధానముతో తిరిగి వచ్చారు.

మొదటి సాధువుతో నారదుడు ఇలా అన్నారు. "నీవు మోక్షానికి చేరువయ్యావట - ఇక మూడు జన్మలలో మోక్షాన్ని పొందగలవట" అని. ఆ సాధువు నారదుడు చెప్పిన భవిష్యద్విషయాన్ని నమ్మలేదు. ఎందుకంటే తాను పూర్తిగా జ్ఞానాన్ని పొందినట్లు భావించినందున "నేను పుట్టినప్పటి నుండి తపస్సు చేస్తూనే ఉన్నాను. ముందటి జన్మలలో కూడ తపము చేసినట్లు నాకు బాగా తెలుసు. అందుచేత మీరు చెప్పినది సరిగా లేదు" అని అన్నాడు.

ఇక నారదుడు రెండవ సాధువుతో "మీరు మర్రివృక్షము క్రింద కూర్చొని తపస్సు చేస్తున్నారట. మీకు కూడా మోక్షము ఒక నిర్ణీత సమయములో లభిస్తుందని విష్ణుదేవుడు చెప్పాడు. అయితే మొదట ఆ వృక్షానికి ఎన్ని ఆకులున్నవో, అన్ని జన్మలెత్తాలట" అన్నాడు నారద మహర్షుల వారు.





ఈ మాటలు వినడముతోనే ఆ సాధువు ఆనందభరితుడయ్యాడు. "విష్ణుమూర్తి నాకు మోక్షము లభిస్తుందని అభయమిచ్చాడు. అది నాకేనాడో ఒకనాడు సంప్రాప్తమవుతుంది. నా తపస్సు ధన్యమైనది" అని సంబరపడ్డాడు. ఇంతలో పెనుగాలి వచ్చి చెట్టు ఆకులన్నీ రాలిపోయాయి. చివరి ఆకు రాలి భూమి మీద పడి వెంటనే ఆయనకు ఆత్మానుభవము కలిగినది. మోక్షము దక్కినది. ఓరిమిని, తృప్తినీ కనపరచెడి సాధువే నిజంగా భగవంతునకు అంకితమైన మహనీయుడు. మొదటి సాధువు అసహనముతో, అసంతృప్తితో తన అపరిపక్వతను చూపించాడు. ఫలితాన్ని పొందలేకపోయాడు. నీకు నిజంగా అంకితభావముంటే, ఆత్మ తెలియబడాలని భగవంతుడిని కోరవు. ఆయన ఏది ప్రసాదిస్తే దానితో తృప్తి చెందగలవు.



# శ్రీ సాయిబాబా సూక్తులు

**(సాయిధామం - సాయిదత్త పీఠం)**

**ఓం శ్రీ గురుభ్యో నమః**

**ఓం శ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ స్వామినే నమః**

కాలాన్ని అనవసర విషయాలలో వ్యర్థం చేయకూడదు. మరుక్షణం ఈ జీవితం ఏమవుతుందో ఎవరికీ తెలియదు, ఏదైనా సంపాదించగలం. కానీ, గడిచిన సమయాన్ని సంపాదించలేము. ప్రతీ క్షణం ఎంతో విలువైనది, విలువైన సమయాన్ని కేవలం భగవంతుని సేవకే త్రికరణ శుద్ధిగా వినియోగించాలి.

"సర్వం గురు మయం"

"జై గురుదేవ్

**- శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**